సాక్షి
జనగామ

మంగళవారం | 30 | మే | 2023



'లింగనిర్ధారణ' ముఠా అరెస్ట్

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ వైద్యులతో సహా 18 మందిని అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

- 8లో▸



హామీలు అమలు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు వీరయ్య అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/28^0$

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



జనగామ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ చట్టబద్ధతకు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని, ఈ మేరకు జూన్ 4న ఉమ్మడి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ సాధనకు ఏళ్ల తరబడి చేస్తున్న ఉద్యమం చివరి దశకు చేరుకుందని, కేంద్ర హోం శాఖ మంత్రి సానుకూల ప్రకటన చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య, చెప్యాల ప్రసాద్, పైసా రాజశేఖర్, ఏలియా, సురేందర్, సోమరాజు, అనిల్, శ్రావణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో పలువురు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.సురేశ్ వీఆర్ నుంచి హసన్‌పర్తి, భూక్య చందర్ వీఆర్ నుంచి కేయూసీ, ఎ.ప్రవీణ్‌కుమార్ వీఆర్ నుంచి వర్ధన్నపేట, బి.రామారావు వర్ధన్నపేట నుంచి హనుమకొండ, డీవీ ఫణి వీఆర్ నుంచి సుబేదారి, డి.రాజు హనుమకొండ నుంచి టాస్క్‌ఫోర్స్‌కు, జి.అరుణ్ భద్రాది కొత్తగూడెం నుంచి జనగామకు, బి.మాధవ్ వీఆర్ నుంచి మట్టెవాడకు, ఎండీ.గాలిబ్ వీఆర్ నుంచి సుబేదారికి, గాలిబ్ షరీఫ్ వీఆర్ నుంచి ఇంతెజార్‌గంజ్‌కు, ఎండీ.వలీ వీఆర్ నుంచి హసన్‌పర్తికి, కె.లక్ష్మి వీఆర్ నుంచి భరోసా కేంద్రానికి, ఎస్.డేవిడ్‌ను వీఆర్ నుంచి కొడకండ్లకు బదిలీ చేస్తూ సీపీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీలతో వీసీ సమావేశం

కేయూ క్యాంపస్: కేయూలో న్యాక్ టీం పర్యటన ముగిసిన నేపథ్యంలో సోమవారం పరిపాలనా భవనం సెనేట్ హాల్‌లో న్యాక్‌టీం కోసం నియమించిన వివిధ కమిటీల చైర్‌పర్సన్లు, సభ్యులతో (వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు) సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ రమేశ్ మాట్లాడుతూ.. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారని కొనియాడారు. ఏయే కమిటీల్లో ఎవరెవరు బాగా పనిచేశారో వారిని ప్రత్యేకంగా అభినందించారు. అందరికీ వీసీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, ఇంటర్నల్ క్వాలిటీసెల్ డైరెక్టర్ ఆచార్య నర్సింహాచారి, అడ్జెంట్ ఆచార్యులు కృష్ణమాచార్య, అడ్వయిజర్ ఆచార్య గోపీ కృష్ణ మాట్లాడారు.

నేడు రైల్వే చీఫ్ సేఫ్టీ కమిషనర్ రాక

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) మంగళవారం కాజీపేట–డోర్నకల్ మధ్య తనిఖీ చేయనున్నట్లు సోమవారం స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట– ఖమ్మం రైల్వే స్టేషన్ల మధ్య నిర్మాణంలో ఉన్న మూడో రైల్వే లైన్ పనుల్ని తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. చింతలపల్లి, నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య నిర్మాణం జరుగుతున్న మూడో రైల్వే లైన్ పనులను కమిషనర్ తనిఖీ చేయడంతోపాటు ట్రయల్ రన్ నిర్వహించి ట్రాక్‌ను ఉపయోగంలోకి తీసుకురానున్నట్లు రైల్వే అధికారులు వివరించారు.

యోగా.. జీవితంలో భాగం కావాలి



హన్మకొండ: యోగాను దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని 58వ బీఎన్ సీఆర్పీఎఫ్ డీసీ సుమ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ యోగా శిబిరం ఆధ్వర్యంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ జవాన్లకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాధాన్యతను యోగా గురువు పోశాల శ్రీనివాస్ వివరిస్తూ ఆసనాలు, ప్రాణాయామం , సూర్య నమస్కారాలు నేర్పించారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ డీసీ సుమ మాట్లాడుతూ యోగా ద్వారా దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని వివరించారు. నిత్యం ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీసీ తులసి, యోగా సాధకులు హిమ, రవీంద్రచారి, హరి, మంజుల రెడ్డి, కౌసల్య, అమరావతి, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

లక్ష్యం పూర్తయ్యేనా?

- ఇంకుడుగుంతలపై పట్టింపేది
- అదను దాటుతున్నా పట్టని అధికారులు
- ప్రజల్లో అవగాహన కరువు
- జిల్లా వ్యాప్తంగా 48,962 మంజూరు
- పూర్తయినవి 17,079 మాత్రమే..



నిర్మాణంలో ఉన్న ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు (ఫైల్)

జనగామ రూరల్: భూగర్భజలాలను పెంపొందించేందుకు గ్రామాలు, పట్టణాల్లో ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో క్షేత్రస్థాయిలో ముందుకు సాగడం లేదు. మొదట ఈ కార్యక్రమాన్ని ఉద్యమం మాదిరిగా చేపట్టినప్పటికీ సరైన ప్రోత్సాహం, అవగాహన లేక లక్ష్యం నీరుగారుతోంది. గతంలో ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టారు. సర్పంచ్‌లు సొంతంగా డబ్బులు పెట్టి తవ్వించారు. ఈ సమయంలో గ్రామాల్లో నిర్మాణాలు ఎక్కువగా జరిగాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఉన్నతాధికారులు పర్యటనకు వచ్చినప్పుడు ఒకటి రెండు గ్రామాలను చూపిస్తూ దాటవేస్తున్నారు. అయితే.. ఫిబ్రవరి నుంచే ఎండలు మండిపోతుండడంతో భూగర్భజలాలు తగ్గిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకుడుగుంతలు భూగర్భజలాలకు ఆధారం కానున్నాయి. ఇంకుడుగుంతలతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించక పోవడం, నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు రాకపోవంతో ఏ గ్రామంలోనూ వందశాతం పూర్తి కాలేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 48,962 ఇంకుడు గుంతలు మంజూరు కాగా ఇప్పటి వరకు 17,079 మాత్రమే పూర్తయ్యాయి.

నిర్మాణం ఇలా..

- ఇంకుడు గుంతల నిర్మాణం చేసేందుకు నాలుగు అడుగుల పొడవు, వెడల్పు 6 అడుగుల లోతులో గుంతను తీయాలి.
- ఇందులో 20, 40 ఎంఎం సన్న దొడ్డు కంకరతోపాటు ఇసుక పోయాలి. వర్షపు నీరు, నిత్యం ఇంటిలో పారే మురుగు నీరు గుంతలోకి చేరేలా చేయాలి. మురుగు నీరు శుభ్రం అవడమే కాకుండా వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. దీంతో బావులు, బోర్లలో నీరు చేరి భూగర్భ జలాలు పెరుగుతాయి.

బిల్లుల చెల్లింపులో జాప్యం..

ప్రజలను చైతన్యవంతం చేసి ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకునేలా చేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టలేదు. అధికారుల సూచనల మేరకు కొంత మంది అప్పుచేసి నిర్మించుకున్నారు. వాటికి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం నిర్మాణాలకు చెల్లించే రూ.6,657 కంటే ఖర్చు అధికంగా అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.



ఈ ఫొటోలో వ్యక్తి పేరు కోల శ్రీనివాస్. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన ఈయన రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆదేశాలతో ఇంకుడుగుంత నిర్మించుకున్నాడు. ప్రభుత్వం చెల్లించే దాని కంటే ఎక్కువ మొత్తంలో ఖర్చు అయింది. ఇందుకు అప్పు చేయాల్సి వచ్చింది. ఇంతవరకు బిల్లు రాలేదు. ఇప్పించి ఆదుకోవాలని శ్రీనివాస్ కోరుతున్నాడు.

జిల్లాలో ఇంకుడుగుంతల వివరాలు..

మండలం	మంజూరు	పురోగతి
బచ్చన్నపేట	3,151	612
చిల్పూరు	3,601	792
దేవరుప్పుల	4,297	1,337
స్టేషన్‌ఘన్‌పూర్	4,230	463
జనగామ	5,063	831
కొడకండ్ల	3,672	516
లింగాలఘణపురం	6,631	267
నర్మెట	3,311	770
పాలకుర్తి	4,126	532
రఘునాథపల్లి	2,857	678
తరిగొప్పుల	3,149	892
జఫర్‌గఢ్	4,874	1,230

పురోగతిలో 8,920 నిర్మాణాలు

జిల్లాలో చాలా వరకు పెండింగ్ దశలోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 8,920 వరకు పురోగతి దశలోనే ఉన్నాయి. కొంతమంది గుంతలు తవ్వి వదిలేశారు. బిల్లులు వస్తాయో రావో అని మధ్యలోనే వదిలేశారు. కొంత మంది బిల్లులు వస్తే నిర్మించుకుంటామని తెలుపుతున్నారు. నిర్మించుకునే వారికి వెంటనే బిల్లులు మంజూరు చేసి ఇంకుడుగుంతల నిర్మాణాలకు తోడ్పాటు అందింస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వెంటనే బిల్లు చెల్లించాలి



గ్రామంలో కార్యదర్శి ఇంకుడుగుంత నిర్మించుకోవాలని చెప్పడంతో సొంత డబ్బులతో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్నం. రూ.9 వేల ఖర్చు వచ్చింది. రెండు సంవత్సరాలు ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు బిల్లు రాలేదు. వెంటనే బిల్లు చెల్లించాలి.

- చాట్ల కళమ్మ, శామీర్‌పేట, జనగామ

ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలి



అడుగంటుతున్న భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా కృషి చేయాలి. ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలి. ప్రభుత్వం నిర్మాణ ఖర్చు చెల్లిస్తుంది. గతంలో బిల్లు రాని వారి వివరాలు పరిశీలించి త్వరగా వచ్చేలా కృషి చేస్తాం.

- రాంరెడ్డి, డీఆర్‌డీఓ, జనగామ

పాలకుర్తి అభివృద్ధికి రూ.100 కోట్లు



ర్యాలీలో కళాకారుల ఆటాపాట.. పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తిటౌన్/పాలకుర్తి: పాలకుర్తి అభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తా.. ఇప్పటికే రూ.150 కోట్లు వెచ్చించా.. మరో రూ.100 కోట్లు ఖర్చు చేస్తానని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధి పాలకుర్తి బృందావన్ గార్డెన్స్‌లో దర్దేపల్లి, కొండాపురం గ్రామాలకు కలిపి ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమేళనాల్లో ఆయన మాట్లాడారు. త్వరలో పాలకుర్తిలో డిగ్రీ కాలేజీ ప్రారంభిస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు మొదలవుతాయని చెప్పారు. బీసీ కుల వృత్తులు చేసుకునే వారికి రూ.1లక్ష చొప్పున ఆర్థిక సహాయం ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, త్వరలో అర్హులను గుర్తించి అందజేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ వచ్చాకే తెలంగాణలో పురాతన దేవాలయాలకు పూర్వవైభవం వచ్చిందని, ఇందుకు సజీవ సాక్ష్యం మన యాదాద్రి, పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ఆలయాలేనని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు కుళ్లుతో కుట్రలు చేస్తున్నాయని, వాటిని పార్టీ శ్రేణులు, ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. అంతకు ముందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకరావు ప్రసంగించారు. అనంతరం మంత్రి మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు వైకుంఠ ధామాన్ని ప్రారంభించాక.. అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు ఆగస్టు 25లోగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, సర్పంచ్ యాకాంతరావు, ఇమ్మడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

జనగామ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఉమాపతి భవన్‌లో జెండా ఎగురవేసిన అనంతరం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగంపై సరైన ప్రణాళిక లేకపోవడంతో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు. గడిచిన ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసి డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఎస్ఎస్‌లో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు కనీస పే స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.యాదగిరి, సునంద, అంకుషావలి, వజ్రయ్య, వెంకన్న, శ్రీరామ్, సత్యనారాయణ, రాజేందర్, రాజారెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువశక్తిని మేల్కొలుపుతాం..

- టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పొన్నాల తదితరులు

జనగామ: యువశక్తిని మేల్కొలుపుతాం.. పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువశక్తిని మేల్కొలిపేలా 60 ప్రశ్నలతో ఇటీవల ప్రియాంకా గాంధీ చేసిన హైదరాబాద్ డిక్లరేషన్ ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి జూన్ 18న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ బహుమతులతో పాటు ప్రోత్సాహకాలు, ఒక మహిళకు ఎలక్ట్రికల్ స్కూటీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు పేర్లను నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ వెబ్ లింకుతో కూడిన ఎస్ఎంఎస్ పొందేందుకు 7661 899 899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని సూచించారు.

ఇంటికో ఉద్యోగం ఏమైంది..

ప్రధాని మోదీ ఏడాదికి రెండు కోట్లు, కేసీఆర్ ఇంటికో ఉద్యోగమంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని పొన్నాల ప్రశ్నించారు. 2014కు ముందు తెలంగాణలో 4.91లక్షల ఉద్యోగాలు ఉంటే ఇప్పుడు మూడు లక్షల ఒక వేయి మాత్రమే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజీవ్ యూత్ డిక్లరేషన్ ప్రకటనకు కట్టుబడి ఉంటుందని చెప్పారు. ఇటీవల వడగళ్లతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల పరిహారం, బ్యాంకుల్లో ఉన్న నాట్ ఫైడ్ ఖాతాల(ఎన్‌పీఏ)ను రెగ్యులర్ చేసి కౌలు రైతులకు ప్రతి స్కీం వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు యూత్ డిక్లరేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి లింగాజీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, కాముని శ్రీనివాస్, అంజయ్య, గురువయ్య, వెంకట్‌రెడ్డి, చిరంజీవి, సంపత్, కళ్యాణి, ఉడుత రవి, మల్లేష్, మాజీద్, జాఫర్ షరీఫ్, చందనరెడ్డి, కట్టకృష్ణ, రాజేష్, యాసిన్, మోర్తాల ప్రభాకర్ పాల్గొన్నారు.

'దశాబ్ది' సంబురం అంబరాన్నంటాలి

- నేటి నుంచి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు
- అన్ని వర్గాల భాగస్వామ్యం ఉండాలి
- సమీక్షలో కలెక్టర్ శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాల సంబురాలు పల్లె పల్లెనా అంబరాన్నంటాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. జూన్ 2 నుంచి 22 వరకు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి అందరూ కంకణ బద్ధులు కావాలని, ఇందుకు జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా కార్యక్రమాల నిర్వహణ ఉండాలని, గ్రామస్థాయిలో ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాలను నడిపించాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఉదయం సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీసీలో మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్లకు పలు సూచనలు అందించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు మధుమోహన్, రాంరెడ్డి, రంగాచారి, రాము, డాక్టర్ ప్రశాంత్, వేణుమాధవ్, చంద్రశేఖర్, వసంత, ఇస్మాయిల్, వినోద్‌కుమార్, కేఆర్.లత, సంధ్యారాణి, రోజారాణి, రజిత, శ్రీనివాస్, నాగులు, కొర్నేలియస్, డాక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

గ్రూప్ వన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జూన్ 11 ఆదివారం నిర్వహించే గ్రూప్ వన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సంబంధిత అధికారులు, ఆయా కళాశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్‌-1 పరీక్షలకు జిల్లాలో 16 సెంటర్లు కేటాయించామని, 13,314 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. విద్యుత్, తాగు నీరు తదితర సదుపాయాల కల్పనతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఏఓ మన్సూరీ, డీపీఓ రంగాచారి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మిల్లర్ల కొర్రీలు.. అన్నదాతల ఆగ్రహం

- రోడ్డుపై ధాన్యానికి నిప్పుపెట్టి ధర్నా



ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

కొడకండ్ల : కొనుగోలు కేంద్రంలో కాంటా అయిన ధాన్యాన్ని నాణ్యత లేదంటూ మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదని, తరుగు పేరుతో ఇబ్బంది పెడుతున్నారని రైతులు ధర్నాకు దిగారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా కొడకండ్ల–వెలిశాల రోడ్డుపై ధాన్యానికి నిప్పుపెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నిర్దేశించిన తేమశాతం వచ్చే దాకా ధాన్యం ఆరబోస్తున్నాం.. కాంటా అయిన తర్వాత లారీలు రాక రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామన్నారు. ఒక్క గింజ తరుగు తీసినా ఊరుకోమని, కాంటా అయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి పోవడంతో విషయం తెలుసుకున్న దేవరుప్పుల ఎస్సై రమేష్‌నాయక్, ఏఎస్సై కత్తి రమేష్ అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా.. అధికారులు హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని భీష్మించారు. తహసీల్దార్ చంద్రమోహన్ చేరుకుని.. నిడిగొండ మిల్లుకు ధాన్యం పంపించి తరుగు తీయకుండా మాట్లాడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పవర్ హౌస్‌గా నిట్ వరంగల్

కాజీపేట అర్బన్: టెక్నాలజీ అండ్ ఎక్విప్‌మెంట్స్‌లో నిట్ వరంగల్ పవర్ హౌస్‌గా నిలుస్తుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ(సీఆర్‌ఐఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడు రోజుల స్తుతి వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో మెలకువలు నేర్చుకునేందుకు సీఆర్‌ఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు సోమశేఖర్, వి.సుధాకర్, హరీశ్, సంజీవిని, శరత్, దేశవ్యాప్తంగా 31 మంది రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో చీడపీడల నివారణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: వరి, పత్తి పంటల సాగులో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త బి.అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం ఛాగల్లు రైతువేదికలో దేశ్‌పాండే ఫౌండేషన్ వార్షిక సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరిలో దీర్ఘకాలిక సాంబమసూరి, బీపీటీ, సిద్ధి విత్తనాలను ఈనెల చివరి నుంచి జూన్ 20 వరకు నారుమడిలో విత్తుకోవాలన్నారు. మధ్యకాలిక వరంగల్ సాంబ, ప్రాణహిత విత్తనాలను జూన్ 20 నుచి జూలై 15 వరకు, స్వల్పకాలిక తెలంగాణ సోనా, కూనారం సన్నాలు, బతుకమ్మ, ఎంటీయూ–1010, జేజీఎల్, కేఎన్ఎం–733 విత్తనాలను జూన్ 20 నుంచి జూలై 15 వరకు నారుమడిలో విత్తుకోవాలని సూచించారు. ఎండాకాలం లోతు దుక్కుల ద్వారా పురుగు కోశస్థ దశలను సమర్థవంతంగా నాశనం చేయవచ్చని చెప్పారు. జూన్ నుంచి జూలై 15 వరకు పత్తి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చని, జూలై 20 తర్వాత విత్తితే దిగుబడి బాగా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మధుశేఖర్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, ఎంపీటీసీ కనకం స్వరూపగణేష్, దేశ్‌పాండే ఫౌండేషన్ మేనేజర్లు నరేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఎక్కడ..?



జనగామ: రైతులకు రుణమాఫీ చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం చెబుతున్నా.. అన్నదాతల పరిస్థితి మరోలా ఉంది. రూ.లక్ష లోపు రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసిన సర్కారు.. అంతకు తక్కువగా ఉన్న రైతుల రుణాలు మాత్రం మాఫీకి నోచుకోవడం లేదు. వడ్డీకి వడ్డీ పెరుగుతూ.. రైతు బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు సైతం ఫ్రీజింగ్‌లోకి వెళ్తోంది. దీంతో రైతులు బ్యాంకర్ల ఒత్తిడికి తలొగ్గి వడ్డీ చెల్లిస్తూ కొత్తగా రెన్యువల్ చేసుకుంటున్నారు. రుణమాఫీకి సంబంధించి.. తమ సొంత డబ్బులను బ్యాంకుల్లో డ్రా చేసుకోలేని దయనియ పరిస్థితుల్లో అన్నదాతలు ఉన్నారు.

పరిహారం జమచేసుకోవద్దు..



2017లో బ్యాంకు నుంచి రూ.80వేల పంట రుణం తీసుకున్నా. ఏటా రెన్యూవల్ చేశారే తప్ప మాఫీ చేయలేదు. ప్రస్తుతం రూ.85వేల వడ్డీ పెరిగి రూ.1.65 లక్షలకు చేరుకుంది. బ్యాంకు ఖాతాలో రూ.15వేల నగదు ఉండగా బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే జీరోగా కనిపిస్తున్నది. రూ.40వేల వడ్డీ చెల్లించాలని బ్యాంకు అధికారులు తెలుపగా లేదని చెప్పాను. రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా ఇటీవల కురిసిన వడగళ్లతో పూర్తిగా నష్టపోయిన. ప్రభుత్వం ఇచ్చే పరిహారం డబ్బు బ్యాంకు అధికారులు జమ చేసుకోకుండా తమకే అందించి పెట్టుబడులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

- టి.రాజిరెడ్డి, రైతు గోపిరాజుపల్లి, జనగామ



పక్క ఫొటోలోని రైతు పేరు రమావత్ శ్రీకాంత్. జనగామ మండలం ఎర్రగుంటతండాకు చెందిన ఈయన జనగామలోని ఓ బ్యాంకులో 2014 సంవత్సరం రూ.60వేల పంట రుణం తీసుకున్నాడు. ప్రస్తుతం వడ్డీ పెరిగి రూ.1.60లక్షలకు చేరుకుంది. యాసంగి సీజన్‌లో 10 ఎకరాల్లో వరి సాగు చేయగా వడగళ్ల కారణంగా 200 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. ఐకేపీ సెంటర్‌లో అమ్ముకోగా సుమారు రూ.1.80లక్షల వరకు వచ్చింది. ఆ డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా ఫ్రీజింగ్‌లో ఉందని చెప్పారు. అధికారులను అడిగితే రుణం మాఫీ కాలేదు.. అసలు, వడ్డీ కలిపి రూ.1.60లక్షలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. వడ్డీ రూ.44వేలు చెల్లిస్తే.. ధాన్యం డబ్బులు డ్రా చేసుకోవచ్చా అని అడగ్గా సాధ్యం కాదని చెప్పిన బ్యాంకు అధికారులు.. కనీసం రూ.23వేలైనా చెల్లించాలని తెలిపారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

● గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజుగౌడ్



కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఉత్తమ గౌడ విద్యార్థులకు నగదు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు గోపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజుగౌడ్ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని గౌడ హాస్టల్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 10వ తరగతిలో 9.8, 10 జీపీఏ, ఇంటర్ సెకండియర్‌లో 950 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు జూన్ 4న గౌడ హాస్టల్ భవనంలో నగదుతో పాటు, సన్మానం, మెమెంటో అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మార్కుల మెమో, కులం సర్టిఫికెట్ జిరాక్స్‌లతో పాటు కలర్ ఫొటోతో దరఖాస్తులను 9849217566, 9704926210 నంబర్లలో వివరాలను తెలియజేసి వాట్సప్‌లో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, కోశాధికారి చిర్ర ఉపేందర్‌గౌడ్, కాజీపేట మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు బత్తిని రాజేందర్‌గౌడ్, గాని సాంబయ్యగౌడ్ , ఏరుకొండ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి బీ-ఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీ-ఫార్మసీ (సీబీసీఎస్) 1 సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు జూన్ 7 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి. మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక సోమవారం తెలిపారు. 7న పేపర్-1 హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ -1 ,9న రెండో పేపర్ ఫార్మాస్యూటికల్ అనాలిసిస్-1, 13న మూడో పేపర్ ఫార్మాస్యూటిక్స్-1, 15న నాల్గవ పేపర్ ఫార్మాస్యూటికల్ ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ ఉంటుందని తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు.



లింగనిర్ధారణ పరీక్షల ముఠా అరెస్ట్

ప్రభుత్వ వైద్యులతో సహా 18 మంది అరెస్ట్

● అర్హత లేని వారితో పరీక్షలు
● వివరాలు వెల్లడించిన సీపీ ఏవీ రంగనాథ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: మగ పిల్లలపై మమకారంతో నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు చేయించుకొని మగపిల్లాడు అని తేలితే గర్భం ఉంచుకోవడం, ఆడపిల్ల అయితే కడుపులోనే కరిగించుకోవాలనుకునే తల్లిదండ్రుల అత్యాశ, అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతూ దందాకు పాల్పడుతున్న ముఠాను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో చేపట్టిన స్టింగ్ ఆపరేషన్ విజయవంతమైంది. ఓ కానిస్టేబుల్‌తో యాంటి హుమెన్ ట్రాఫికింగ్, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా చేపట్టిన స్టింగ్ ఆపరేషన్‌లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. దీనిపై సీపీ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ ప్రాంతంలోని వెంకటేశ్వరకాలనీలో ఎలాంటి వైద్య, విద్య అర్హతలు లేకున్నా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన 18 మంది నిందితులను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, టాస్క్‌ఫోర్స్, కేయూ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి మూడు లింగనిర్ధారణకు వినియోగించే స్కానర్లు, 18 సెల్‌ఫోన్లు, రూ.73 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో వేముల ప్రవీణ్, వేముల సంధ్యారాణి, డాక్టర్ బాల్నె పార్థు, మోరం అరవింద్, మోరం శ్రీనివాస్‌మూర్తి, బాల్నె పూర్ణిమ, వార్ని ప్రదీప్‌రెడ్డి, కైత రాజు, కల్లా అర్జున్, ప్రణయ్‌బాబు, కీర్తి మోహన్, బాల్నె ఆశాలత, కొంగర రేణుక, భూక్య అనీల్, చెంగెల్లి జగన్, గన్నారపు శ్రీలత, బండి నాగరాజు, కాసిరాజు దిలీప్ ఉన్నారు.

నిష్పత్తిపై అనుమానం రావడంతో..

కమిషనరేట్ పరిధిలోని కొన్ని మండలాల్లో ఆడ, మగ పిల్లల నిష్పత్తిలో తేడాలు పెద్దగా ఉండటం, లింగనిర్ధారణకు పాల్పడుతూ పుట్టబోయే బిడ్డ గురించి తెలుసుకొని ఆడపిల్ల అయితే గర్భస్రావానికి పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదులు రావడంతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, టాస్క్‌ఫోర్స్, జిల్లా వైద్య విభాగాలతో కలిసి ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టినట్లు సీపీ తెలిపారు. పోలీసులు 'ఆపరేషన్ డెకాయ్' నిర్వహించి అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ చేశారని తెలిపారు. ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్ గతంలో స్కానింగ్ కేంద్రంలో టెక్నీషియన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. గతంలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడటంతో హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రవీణ్ సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో తన భార్య సంధ్యారాణితో కలిసి కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్ ప్రాంతంలోని వెంకటేశ్వరకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. గర్భవతులకు లింగనిర్ధారణ పరీక్షలు చేసేందుకు కొంతమంది సిబ్బందితో పోర్టబుల్ స్కానర్ల సహాయంతో స్కానింగ్ కేంద్రాన్ని రహస్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవీణ్, ఆర్‌ఎంపీలు, పీఆర్‌ఓలు, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, సిబ్బంది, డాక్టర్లతో కలిసి ఒక నెట్‌వర్క్‌గా ఏర్పాటు చేసుకున్నాడు. తాను రహస్యంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్‌కు లింగనిర్ధారణకు వచ్చే మహిళలకు పరీక్షలు నిర్వహించి పుట్టబోయే బిడ్డ గురించి తెలుసుకొని ఆడపిల్ల అయితే గర్భస్రావం కోసం ఈ ముఠాకు చెందిన హాస్పిటల్స్ హనుమకొండలోని లోటస్, గాయత్రి, నెక్కొండలోని ఉపేందర్ (పార్థు) హాస్పిటల్, నర్సంపేటలోని బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో గర్భిణులకు హాస్పిటల్‌లోని డాక్టర్లు, సిబ్బంది అక్రమంగా గర్భస్రావాలు చేసేవారని తెలిపారు. దీనికోసం బాధితుల నుంచి ఫీజుల రూపంలో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన ఈ ముఠా సభ్యులు కమీషన్ల రూపంలో వాటాలు పంచుకునేవారన్నారు. ఒక్కో గర్భస్రావానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేసేవారని సీపీ చెప్పారు. ఇప్పటి వరకు ఈ ముఠా 100కు పైగా గర్భస్రావాలకు పాల్పడినట్లుగా గుర్తించినట్లు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షల కోసం రాక..

రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ఆడ, మగ పిల్లల గురించి తెలుసుకోవటానికి ఈ ముఠా సభ్యులను కలిసినట్లు సీపీ తెలిపారు. ముఠా సభ్యులకు సరైన అర్హత లేకపోవడంతో ఒక్కోసారి మొబైల్ స్కానర్లతో ఆడ, మగ స్పష్టంగా తెలియకపోయినా ఆడ పిల్లలు అని చెప్పి డబ్బులు గుంజినట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు చాలా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి పరీక్షల కోసం వచ్చినట్లు పేర్కొన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకున్న మొబైల్ స్కానర్లను వినియోగించుకొని పాడుబడ్డ ఇళ్ల కేంద్రంగా చేసుకొని పరీక్షలు నిర్వహించారన్నారు. వైద్య పరికరాలు అమ్మిన వారితో పాటు, ఆర్‌ఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గర్భవిచ్ఛితి చేస్తున్న క్రమంలో తీవ్రంగా రక్తస్రావం జరిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు ఉన్నాయని సీపీ తెలిపారు.

ఆస్పత్రులపై నిఘా ఉంచాం..

వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, హన్మకొండ అడిషనల్ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు చేస్తున్న ఆస్పత్రులపై నిఘా పెట్టినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న డాక్టర్లపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని సీపీ రంగనాథ్ పేర్కొన్నారు.

అధికారులకు అభినందనలు..

ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన అదనపు డీసీపీ పుష్పా, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సుజాత, శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఎస్సైలు ఫసీయుద్దీన్, మల్లేశం, శరత్‌కుమార్, ఏఏఓ సల్మాన్, ఏహెచ్‌టీయూ సిబ్బంది, ఏఎస్సై భాగ్యలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ సమీయుద్దీన్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సైబర్ క్రైం సిబ్బంది కిషోర్‌కుమార్, రాజు, ఆంజనేయులు, రజియా సుల్తానా, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శ్యాంసుందర్, సురేష్, ప్రభాకర్, కమల వసంత, సిబ్బందిని సీపీ ఏవీ రంగనాథ్ అభినందించారు.

జూన్ 3 నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో డిగ్రీ బిఏ, బికాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో జూన్ 3 నుంచి 10 వరకు 2, 4, 6 వ సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి .మల్లారెడ్డి, అదనపు పరీక్షలనియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను బట్టి బ్యాచ్‌లుగా రూపొందించుకొని ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో సమాచారం అందుబాటులో ఉంచారు. జూన్ 13 నుంచి థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

దుర్గామాత పండుగకు వెళ్లి వస్తుండగా..

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బచ్చన్నపేట : దుర్గామాత పండుగకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం... లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన నూకల రాంరెడ్డి (45), జ్యోతి భార్యభర్తలు బైక్‌పై సిద్దిపేట జిల్లాలోని పుల్లూరు గ్రామంలో జరుగుతున్న దుర్గామాత పండుగకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా సిద్దిపేట సీపీ కార్యాలయం సమీపంలో వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా రాంరెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.



రాంరెడ్డి (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

● హైదరాబాద్‌లో మరణించిన ములుగు జిల్లా వాసి

ములుగు రూరల్: ములుగు మండలం పంచోత్కులపల్లికి చెందిన ఎల్లావుల రాజేష్ హైదరాబాద్ హయత్‌నగర్ శివారులో అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన ఎల్లావుల పరుశురాం-రమ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రాజేష్(25)హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి ఇతర దేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. మార్చి నెలలో హోలీ పండుగ అనంతరం రాజేష్ హైదరాబాద్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి తరుచూ ఇంటికి ఫోన్ చేసి మాట్లాడేవాడని తెలిపారు. ఈ నెల 26న తన తల్లి రమకు ఫోన్‌చేసి ఇంటికి వస్తా డబ్బులు పంపించడని మాట్లాడినట్లు తెలిపారు.అప్పటి నుంచి ఇంటికి ఫోన్ చేయలేదని ఉదయం పోలీసుల నుంచి మీ అబ్బాయి మృతి చెందాడని తెలుపగా తల్లితండ్రులు శోకసంద్రంలో మునిగారు. రాజేష్ మరణవార్త తెలియగానే ఇటు అమ్మవారి ఊరు ములుగు, పంచోత్కులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజేష్ మృతదేహం హైదరాబాద్‌లో ఉండగా అక్కడికి తల్లితండ్రులు, బంధువులు తరలివెళ్లారు.



రాజేష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి నేత..

వరంగల్: వరంగల్-ఆరెపల్లి సమీపంలోని వ్యవసాయ కళాశాల వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దామెర మండలం తక్కెళ్లపాడుకు చెందిన విద్యార్థి సంఘం నేత బండారి చిరంజీవి(35) మృతి చెందినట్లు ఏనుమాముల ఎస్సై రాజన్‌బాబు తెలిపారు. ఎంసీపీఐయూ పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడిగా, విద్యార్థి సంఘం రాష్ట్ర సహా కార్యదర్శిగా కొనసాగుతున్న చిరంజీవి హనుమకొండకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. అగ్రికల్చర్ కాలేజ్ ఎదురుగా పైడిపల్లి దగ్గర రోడ్డుపై ఆగి ఉన్న లారీలో ధ్వజస్తంభం ఉండడం, సుమారు 15 ఫీట్లు బయటకు రావడంతో నల్లని రంగులో ఉండడం వల్ల గుర్తించకుండా మోటార్ సైకిల్‌పై వస్తూ ఢీకొట్టడంతో మృత్యువాత పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.



చిరంజీవి (ఫైల్)

సంతానం కలగడం లేదని యువకుడి ఆత్మహత్య

ఏటూరునాగారం : సంతానం కలగడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎలిశెట్టిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం. ఎలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన హన్మంతరావు-నర్సక్క కుమారుడు పులిశె చంద్రశేఖర్(28) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రశేఖర్‌కు నాలుగేళ్ల క్రితం మౌనికతో వివాహం జరిగింది. అతనికి సంతానం కలగడం లేదని గత కొంత కాలంగా మద్యానికి బానిసై ఈనెల 28న ఆదివారం భార్యతో గొడవపడగా అతని భార్య పుట్టింటికి వెళ్లిందన్నారు. సంతానం కలగడం లేదని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్క వారు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చంద్రశేఖర్ (ఫైల్)

సదస్సు విజయవంతంపై ప్రచారం

● విభాగాలు తిరుగుతూ జేఏసీ బాధ్యులు కరపత్రాల పంపిణీ
● నేడు కామర్స్ సెమినార్ హాల్‌లో రాష్ట్రస్థాయి సదస్సు



కాంట్రాక్టు లెక్చరర్లకు సదస్సు కరపత్రాలను పంపిణీ చేస్తున్న కరుణాకర్‌రావు, ఇతర బాధ్యులు

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న చలో కాకతీయ పేరిట రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించబోతున్నామని విజయవంతంచేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (కుక్టా) జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.కరుణాకర్‌రావు, ఇతర బాధ్యులు సోమవారం క్యాం పస్‌లోని వివిధ విభాగాలను తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంట్రాక్టు అధ్యాపకులను కలిసి కరపత్రాలను పంపిణీ చేసి సదస్సులో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కరుణాకర్‌రావు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల రాష్ట్రస్థాయి సదస్సును మంగళవారం ఉదయం 11 గంటలకు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులతో చలో కాకతీయ పేరిట రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా ప్రముఖ సామాజిక వేత్త ,హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యులు జి.హరగోపాల్, రాష్ట్ర మాజీ ఉన్నత విద్యామండలి చైర్మన్, రిటైర్డ్ ఆచార్యులు టి.పాపిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యులు లక్ష్మణ్ పాల్గొంటారని కరుణాకర్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, డాక్టర్ కనకయ్య, డాక్టర్ బి.వెంకట గోపినాథ్, డాక్టర్ చిర్ర రాజు డాక్టర్ నీలిమ, సలోమియా తదితరులు పాల్గొన్నారు. కాగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కూడా కరపత్రాలను పంపిణీ చేశారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

కాశిబుగ్గ : ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కట్టి ఇస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్లే రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలందరూ భూపోరాటాలు చేస్తున్నారని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు ఎస్.వీరయ్య అన్నారు. సోమవారం ఏసీరెడ్డినగర్ సీపీఎం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జాతీయ, రాష్ట్ర నాయకులు వీరయ్య, నాగయ్యలు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలు రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాలో 60 కేంద్రాల్లో భూపోరాటాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాదారుల పాలు కాకుండా ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇచ్చిన పార్టీ సీపీఎం అన్నారు. శివనగర్ 321 సర్వే నెంబర్ భూమి ప్రభుత్వ భూమి అని అది పేద ప్రజలకు మాత్రమే చెందాలని ఆ దిశగా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు రంగయ్య, సింగారపు బాబు, సాగర్, కుమార్, రత్నమాల, దుర్గయ్య, సారంగపాణి, ఉదయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యమేలా ?

● పరిష్కారం వైపు మొగ్గు చూపని సెక్టార్ అధికారులు
● గిరిజన దర్బార్ 109 వినతుల్లో 77 పెండింగ్
● గిరిజనులకు శాపంగా మారిన వైనం



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీఓ వసంతరావు

ఏటూరునాగారం: గిరిజనులకు సత్వర న్యాయం జరగాలని ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను సోమవారం ఐటీడీఏ గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ అంకిత్ స్వీకరించారు. వినతులను ఆయా సెక్టార్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించినట్లు నమోదు చేయాలి. లేకపోతే ఆ సైట్‌లో పెండింగ్ చూపెడుతుంది. సెక్టార్ అధికారులు వారి శాఖ పరమైన సమస్యలను పరిష్కరించకపోవడంతో మే 1 నుంచి 29 వరకు ఐటీడీఏ గిరిజన దర్బార్‌లో 109 వినతులు రాగా అందులో 32 మాత్రమే పరిష్కరించగా 77 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించడంలో ఆయా సెక్టార్ అధికారులు నిర్లక్ష్యం చూపడం గిరిజనులకు శాపంగా మారింది. ఐటీడీఏ పీఓ, ఏపీఓలు అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా దున్నపోతు మీద వర్షం పడినట్లు ఉంది అధికారుల పనితీరు.

ఐటీడీఏ పరిధిలోని శాఖలు	వచ్చినవి	పరిష్కారం	పెండింగ్
ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్	22	8	16
డీడీ ట్రైబల్ వెల్ఫేర్ విద్యాశాఖ	15	4	11
ఆర్‌ఓఎఫ్‌ఆర్	22	2	20
ప్రాజెక్టు అగ్రికల్చర్	12	9	2
డీఎం జీసీసీ	5	5	0
ఎస్‌ఓ	1	0	1
పెసా కోఆర్డినేటర్	1	0	1
ఇరిగేషన్	1	0	1
ఆఫీస్ మేనేజ్‌మెంట్ ఐటీడీఏ	2	0	2
ఎంపీడీఓ మంగపేట	1	0	1
ఆర్‌సీఓ మహబూబాబాద్	7	1	6
తహసీల్దార్ ఏటూరునాగారం	1	0	1
డీఆర్‌డీఓ ములుగు	4	1	3
డీటీడీఓ హనుమకొండ	1	0	1
డీఐఈఓ	1	0	1
సీడీపీఓ ఐసీడీఎస్	1	0	1
ఎంపీడీఓ వాజేడు	1	0	1
ఎంపీడీఓ నర్సంపేట	1	0	1
ఏసీఎంఓ	1	0	1
ఎంఆర్‌ఓ నర్సంపేట	1	0	1
ఐకేపీ ఏటూరునాగారం	1	0	1
ఎఫ్‌ఆర్‌ఓ మంగపేట	2	0	2
ఎన్‌పీడీసీఎల్	3	1	2
ఆర్‌సీఓ వరంగల్	1	1	0
ఎంఆర్‌ఓ కొత్తగూడ	1	0	1
	109	32	77

గంజాయి స్మగ్లర్ అరెస్ట్

● పరారీలో మరో ఇద్దరు
● రూ.24 లక్షల విలువ చేసే గంజాయి, కారు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సీపీ ఏవీ రంగనాథ్



నిందితుడి అరెస్టు చూపుతున్న సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం : గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు సీపీ ఏవీ రంగనాథ్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.24 లక్షల విలువైన 120 కిలోల గంజాయి, ఒక కారు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ ములుగు జిల్లా పందికుంటకు చెందిన చెక్క కుమారస్వామి జీవనోపాధి కోసం కారును కొనుగోలు చేసి కిరాయిలకు పోయి డబ్బు సంపాదించేవాడు. కారు ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో పాటు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత 8 ఏళ్లుగా ఒడిశా రాష్ట్రంలోని కలిమెల ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి దానిని పెద్ద మొత్తానికి ఇతర రాష్ట్రాల్లో విక్రయించేవాడు. పలుమార్లు ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని కారులో తరలించినట్లు తెలిపారు. పలుమార్లు పోలీసులకు చిక్కడంతో నిందితుడిని జైలుకు తరలించినట్లు సీపీ తెలిపారు. గతంలో కుమారస్వామి మహారాష్ట్ర పూణేలోని ఎరవాడ జైలులో 30 నెలలు జైలుశిక్షను అనుభవించాడని తెలిపారు. జైలు నుంచి విడుదలైన అనంతరం అతనిలో ఎలాంటి మార్పు రాకపోగా తిరిగి మరో గంజాయి స్మగ్లింగ్‌కు సిద్ధపడ్డాడని తెలిపారు. నిందితుడు ఆదివారం ప్రస్తుతం పరారీలో ఉన్నా మరో నిందితుడు ఒడిశాకు చెందిన గణేష్ అలియాస్ గన్ను వద్ద 120 కిలోల గంజాయిని కొనుగోలు చేసి వాటిని రెండు కిలోల చొప్పున ప్యాకెట్లుగా మార్చాడు. తన కారులో రహస్యంగా భద్రపర్చి మరో నిందితుడు దుప్పటి మోహన్ అలియాస్ చింటు సహకారంతో గంజాయిని ఏటూరునాగారం, వరంగల్ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆత్మకూరు పోలీసులతో కలిసి సోమవారం ఉదయం ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న కారును పోలీసులు ఆపి తనిఖీ చేస్తుండగా డ్రైవర్ మోహన్ తప్పించుకుపోగా ప్రధాన నిందితుడు చెక్క కుమారస్వామి తప్పించుకునే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకొని పోలీసులు అదుపులోకి తీసుకొని కారును తనిఖీ చేయగా అందులో గంజాయి గుర్తించిన పోలీసులు నిందితుడితో పాటు కారు, గంజాయిని ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.. కుమారస్వామిపై మహబూబాబాద్, ములుగు జిల్లాలతో పాటు మహారాష్ట్రలో కేసులు ఉన్నట్లు సీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, జనార్దర్‌రెడ్డి, ఎస్సైలు శరత్‌కుమార్, లవణ్‌కుమార్, నిస్సార్ పాషా, ఏఏఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, స్వర్ణలత, కానిస్టేబుళ్లు సురేష్, ప్రభాకర్, మహ్మద్ పాషా, శ్యాం, కరుణాకర్, రాజు, శ్రావణ్‌కుమార్, నాగరాజులను సీపీ అభినందించారు.